# ఈలోకం

మా పెద్ద తగాదా ఐన తరవాత మూడువారాలకి జయలక్ష్మి ఓనాటి ఉదయం చీటీ పంపింది నాకు. మొగలిపూవుల పరిమళాలు చల్లె పిన్కుకాయితంమీద రాసి -

"ఇంక భరించలేను, నేనుగా అడుగుతున్నాను, ఈవాళ మధ్యాన్నంనించి టతీవవగా రా." అని. గర్వాల జయలక్ష్మి. పెంకెపట్ల జయలక్ష్మి.

కాని.... కాని.... నాకు తెలుసు. కలుసుకున్నా లాభంలేదు. ఎవరికీ తృప్తిరాదు. సాయంత్రం లోపలే మళ్ళీ పోట్లాడుకుంటాము. ఎంత ఆలోచించినా ఈ సమస్య తెగదు నా మనస్సులో. ఇద్దరం వివేకవంతులం. మంచి హృదయం కలవాళ్ళం. పిచ్చి పాత అభిప్రాయలనుంచి మనసుల్లో బైటపడ్డవాళ్లం. అవసరమైనంతవరకు ప్రజాభిప్రాయాన్ని ధిక్కరించగల చేవగలవాళ్ళం. పది నెలలుగా మమ్మల్ని విడవని మమతతో కలుసుకుంటున్నవాళ్ళం. కాని దినాలు గడిచిన కొద్దీతీవ్రంగా పోట్టాడుకుంటాము. చాలా రోజులు ఒకరి నొకరుం చూసుకోలేనంత ద్వేషంతో; జన్మలో మరిచిపోగలమా అన్నంత వాడిగల మాటలతో; ఇంతకన్న అధములు వుంటారా అన్నతం పరస్పరం తృణీకారంతో.

కాని పోట్లాడి విడిపడ్డ తరవాత, ఎందుకు బతుకుతున్నామా, జీవితంలో యీ కాసిని గంటలూ ఎందుకు వృధా చేసుకుంటున్నామా, అని నిశ్చయంగా పరితాపపడి నిలవలేక నిమిషాలమీద కలుసుకుంటాము.

ఎందుకు తగాదా అని ఆలోచించుకుంటే, ఎందుకు తగాదాపడ్డామో ఆ విషయాలు తర్కించుకుంటే ఏమీలేదు. వుత్తతగాదా పడడంకోసమే. కలుసుకోగానే మొదటపలకరింపే వెక్కిరింపుతో. దాని తరవాత కొంచెం తృణీకారం, కోపం, క్రమంగా ద్వేషం, మా కావిలింతలు కూడా అట్లానే. ఆమె కాక నాకూ ఉంది దిక్కు. నేను కాక ఆమెకీవుంది దిక్కు, శృంగార తృష్ణ తీర్చుకోడానికి.

ఆలోచించగా ఒకరి నొకరం విడవలేమనీ, వొదిలి బతకలేమనీ, ఆమెని బైటికి రమ్మనే ధైర్మం నాకు లేదనీ, నాచేత ఆ పని చేయంచే బలం ఆమెకి లేదనీ, అందువల్ల నే యీపరస్పర ద్వేషమనీ అనుకుంటాను. ఆమె ఎట్లానూ రాదని తెలిసి, ఆ ధైర్యంతోనే.

"పోనీ వొచ్చెయ్యి" అంటాను.

"ఇన్నాళ్ళకి వొచ్చిందే మహాసాహసం" అని వెక్కిరిస్తుంది ఆమె.

"వొచ్చే సాహసం నీలో లేదనే నే ననలేదు" అంటాను.

"నేను రానని నిశ్చయంగా తెలుసును గనకనే అనగలిగారు ఆ మాట" అంటుంది ఆమె.

"అవునులే, నువ్వెందు కొస్తావు ? అంతా మర్యాదగా, రహస్యంగా జరగాలి, నీవల్ల నేనెంత న్యూనత పడుతున్నానో...."

"ఆహా మాట్టాడుతున్నాడయ్యా మొగాడు ! తనకిట న్యూనత ! సిగ్గులేదూ...."

"నోరుముయ్యి. ఇప్పుడు రా. ఇట్లా వొచ్చెయ్యి-"

"పద. వొస్తున్నా పద....."

ఇదంతా వొకరి అధైర్యం వొకరికి నిశ్చయంగా తెలిసి. ఈవాళ.

"రమ్మంటోంది, వెళ్లకూడదు, వెళ్ళను. వెళ్ళి ఏం లాభం ? కాని పాపం రమ్మంటోంది. నాకోసం చూస్తో వుంటుంది. నేను వెళ్ళకపోతే చాలా గాయపడుతుంది. సిగ్గుపడిపోతుంది. ఆడదాన్ని అట్లా అన్యాయం చేయకూడదు" అనుకుంటానుగాని నా అసలులోపల జరిగే దేమిటంటే....

"ఆమె రొమ్ము, నన్ను ఆహ్వానించే రొమ్ము. చేతుల ఒత్తిడితో నా రొమ్ము కింద కదిలే కఠినమైన రొమ్ము. కాంక్షకై పెక్కి నన్ను కరిచిపట్టుకునే పళ్ళు..... వెళ్ళక రాత్రి నిద్ర పోగలనా ? ఇంక జన్మలో ఆ అనుభవం చిక్కుతుందా నాకు ! నన్ను తిడుతోనే నా పెదిమల్ని వొదలలేని పెదిమలు ! ఆ వెక్కిరింపులోని చందమామ వంకర !"

కాదు. ఈవేళ స్పష్టంగా మాట్లాడి వొస్తాను. ఇక లాభంలేదని, విడిపోవాలని, నా కోసం చీటీ రాయవద్దని, చాలా నిశ్చయంగా చెప్పేసి వెళ్ళిపోతాను. వూరు వదలి బొంబాయిపోయి, నా పాతమిత్రుల కౌగిళ్ళలో ఈమెని మరిచిపోతాను. ఏమిటి ఈ మాత్రం అందం దొరకదా ఏమిటి నాకు, కాని మళ్ళీ కలుసుకున్నానా వొదుల్చుకోగలనా ? అట్లా కాదు.

అని సామాను సర్దమన్నాను నౌకర్ని. బొంబాయికి బర్తు రిజర్వు చేయించాను. తాత్సారం చేసి నాలుగింటికి బైలుదేరాను జయలక్ష్మి ఇంటికి. వెడుతూనే యోచించుకుంటున్నాను నా మొదటిమాటలు ఆమెని ముందు మాట్లానియ్యకూడదు. సిట్యుయేషన్‌కి నేను మాస్టరు కావాలి. ఆమెకి ఛాన్సు ఇచ్చానా, నాకేసి వీపుతిప్పి.

"ఎవరు" అంటుంది కావలిసి. లేకపోతే, వికారంగా నవ్వుతుంది. "రానిచ్చిందా అహంభావం ?" అంటుంది. కాదు. నేను మాట్టాడుతోనే ప్రవేశించాలి.

"ఇది ముందు విను లక్ష్మీ. నేనంతా యోచించి చివరిమాటలు చెప్పడానికి వచ్చాను. ముందు నా మాట చివరిదాకా విను. నేను వెళ్ళిపోతున్నాను. నువ్వు న్యూనతపడతావని వొచ్చాను. ఈసారికి మాత్రం." ఈ విధంగా సీరియస్‌గా మాట్లాడుతోనే ఆమెని స్వాధీనం చేసుకోవాలి. ఆమెకళ్ళు మూసి కావలించుకోవాలి. ఆమె కళ్ళు నన్ను వెక్కిరించకండా మళ్ళీ ఒక్కమాట వినకండా....

ఎప్పుడూ జీవితంలో అనుకున్నట్టు జరగదు గదా !

తలుపు లోపల గడియవేసి వుంది. కళ్ళు తిరిగాయి. నాతోపాటు యింకెవరికన్నా చీటీ రాసిందా? రాయదు. అది తెలుసు నాకు. అయితే మరి? ఆలస్యం చేశానని కోపమా? తలుపు వెనక నవ్వుతోందా ? లోపల్నించే. నాచేత లెంపలు వాయింపచేసి, ప్రాధేయ పడేయించిగాని తలుపు తియ్యదా?

గట్టిగా తలుపుకొట్టాను.

దూరంనించి దాసీది కనకం వొస్తున్నానని కేకవేసింది. పది నిమిషాలు నిశ్శబ్దం. ఓ చేతినిండా నురుగుతో, కనకం తలుపు తీసింది. అమ్మగారు తలంటి పోసుకుంటున్నారట.

గదిలో కూచున్నాను. అరగంటయింది. దూరంగా నీళ్ళు పోసుకుంటున్న చప్పుడుతప్ప ఇంకేం వినపట్టంలేదు. బల్ల మీద "ఆంధ్రజ్యోతి" పేజీలు తిరగేశాను. చలం దీక్షితులుగారికి రాసిన లేఖలు. శృంగారాన్ని నమ్మిబతికిన చలం చివరికి మహర్షి పాదాల్ని ఆశ్రయించాడు. ఈ దేశంలో ప్రతివారూ చివరికి అక్కడికి చేరుకోవలసిందే గావును. నేను ఎప్పుడో చూసిన భగవాన్ పటం జ్ఞాపకం వొచ్చింది. ఆ భగవాన్ చలాన్ని యీ శృంగారపు చిక్కులనించి రక్షించగలిగారా? కాని చలం శృంగారాన్ని చిక్కు అనడు. నా ప్రారబ్ధంవల్ల నాకీ జయలక్ష్మి ప్రాప్తించింది. తృప్తిలేని, గౌరవంలేని తృణీకారాల జయలక్ష్మి. ఎందుకో ఆ పొగరూ ? ఏం చూసుకుని ? రాదేం ఇంకా ? కావలిసే ఈ ఆలస్యం. ఒకటి చెయ్యాలి. నేను సరాసరి నీళ్ళగదిలోనికి వెడితే; దాసీది వుంటుంది. వుండనీ. దాన్ని బైటికి గెంటుతాను, అల్లరి చేస్తాను. నేనంటే ఏమిటో తెలియచేస్తాను.

"స్నానం కావొచ్చింది" అంటో కనకం వీధిలోకి వెళ్ళింది.

స్నానాలగది లోపల తలుపుగడియ నాకోసమేకాదు. ఆమెని చూడాలి. ఇంకా వెక్కిరింపులు లేవు. ఎందుకు తగాదాలు ? ఆమె పాదాక్రాంతుణ్ణవుతాను. బతిమాలతాను. తగాదాలూ వెక్కిరింపులూ ఇక మనమధ్య వొద్దని. కాని బొంబాయి ప్రయాణమో ! చూద్దాం. ముందు జయలక్ష్మిని చూడాలి.

"జయా !" అని నమ్రతగా స్నేహంగా పిలిచాను.

"ఏం సంగతి !"

వెక్కిరింపు.

"ఎంతసేపు"

"నాలుగు గంటలు కాలయాపన చెయ్యగలిగిన అయ్యగారికి యీ పది నిమిషాలూ భారమైనాయి గావును. మొగబుద్ధి" అని చీదరించుకుంది.

దాసీది లేదు, నన్ను రానీయకూడదా ?

నా కోపాన్ని మింగుకుని దీనంగా,

"ఒక్కసారి నిన్ను చూడనీ."

"వీల్లేదు. నేను వొచ్చేలోపల దొడ్లోకి వెళ్ళి స్నానం చేస్తున్న నీటికాలవని ఆరాధించండి."

ఏమిటి ?

"ఏం మాట్లాడరేం ? నేను పెట్టుకున్న పువ్వుల్ని, నేను తాకిన కాయితాల్ని దాచుకుని పూజించిన రోజులు జ్ఞాపకం తెచ్చుకోండి."

విసుక్కుని దొడ్లోకి పోయినాను. తూములోనించి నవ్వుతో దూకుతున్నాయి తెల్లటి నీళ్ళు - వట్టివేళ్ళ సున్నిపిండితో పరిమళమైన నీళ్ళు.

ఇంతేనా ? ఈమెని విడవలేనా? వొదిలి పోలేనా ? ఆ గదిలో నగ్నమైన ఆమె వొళ్ళు నా కళ్ళముందు నిలిచింది. ఆ వొంటిని తడిపి వొచ్చిన ఆ నీళ్ళు గంగాజలంకన్న పవిత్రమైనాయి నా కళ్ళముందు. ఆ నీటిలో నా వేళ్ళని ముంచాను భక్తితో. ఏమిటి ఇట్లా ఔతున్నాను ? ఏమిటీ ఆరాధన ! స్త్రీ శరీరం ఎన్నో రహస్యాలతో, మధురమైన ఆశలతో, అనుభవపు పిలుపులతో, వెలుగు నీడలతో.... అంతకన్న పరమావధి ఏముంది పురుషుడికి! కాని, కానీ మళ్ళీ ఆ మాయలో పడుతున్నానా ? ఇంతేనాఇంక ? మళ్ళీ జయలక్ష్మితో తగాదాలు, అనుమానాలు. జయలక్ష్మితప్పితే ఇంకోరు. స్త్రీ లేంది బతకలేను. స్త్రీతో వేగలేను. ఈ చక్రంలోంచి విముక్తి లేదా ? కాదు. అట్లా కాదు. ఆ సమస్యనేదో ఇక్కడే ఇప్పుడే తేల్చుకోవాలి. మోహప్రవాహలో ఇట్లా కొట్టుకుపోవడానికి వొప్పుకోను. ఈ కనపడే లోకం వాస్తవం. నా వాస్తవం తెలుసుకుంటేనే గాని కదలను. ఇదంతా మాయ అంటాను. వాస్తవంగా మాయకింద చూడగలమన్నవాళ్ళున్నారు. ఇదంతా ఓ కల అని నిశ్చయంగా చెపుతారు. సత్యమేదో నేను తెలుసుకోలేనా?

ఆ నీళ్ళకాలవ వెంట పదడుగులు నడిచాను. ఆ నీళ్లు ఓ మురిగిన పేడకుప్పని పాయలై చుట్టుకుంటున్నాయి. స్త్రీ హస్తాలవలె. చప్పున పెద్ద విరక్తి తోచింది. ఇంతే స్త్రీ మోహం. స్త్రీ హృదయం. ఇంతకన్న నీచం ఇంకేం లేదు, ప్రపంచంలో. ఈ భావాలు నా మనసులోంచి కాదు. నాలోంచి, 'నేను' అనే లోతునించి కలిగాయి. భక్తినించి చప్పున పెద్ద విరక్తి. "చలం" భగవాన్. నాకింక విముక్తీ జ్ఞానం రావా ? అని పెద్ద అరుపు అరిచాను నా లోపల.

నా కళ్ళముందు ప్రపంచం తళతళమంది. దివ్యచక్షువు తెరుచుకున్నట్టయింది. ఇల్లు దొడ్డి అన్నీ మాయమైనాయి. నా ముందు ఆ మురిగిన పేడకుప్ప తప్ప యింకేం కనిపించలేదు. ఆ పేడకుప్ప పెరిగి నా లోకమైపోయింది. నా దృష్టి ఆ పేడని చీల్చుకుని చూస్తోంది. ఆ పేడ కుప్పనిండా పురుగులు - పెద్దవీ - చిన్నవీ - కంటికి కనపడనంత సూక్ష్మమైనవి. మైక్రోస్కోపులోంచి చూస్తున్నట్టుగా వుంది. వాటి సంభాషణ కూడా వినిపించి అర్థమౌతోంది నాకు.

ఆంధ్రదోమల మహాసభ తరువాత, నెల్లూరు పెన్నలో చేపల సంభాషణ అర్థం చేసుకోవడానికి చేసిన సాధన ఫలితంగా, ఇప్పుడీ పేడలో పురుగుల జీవితం వ్యక్తమయ్యే ప్రజ్ఞ కలిగినట్టుంది నాకు.

ముందు నా కళ్ళముందు ఒక బడి కనపడ్డది.

టీచరు ! "ఈ భూమి ఆకారం ఎట్లా వుంటుంది !"

తెలివిగల విద్యార్థి : కుప్పలాగు వుంది.

టీచరు : "ఛీ. స్టుపిడ్ next next ఎన్నిసార్లు చెప్పాలి మీకు. భూమి గుండ్రంగా వుంది. అందరూ అనండి...."

విద్యార్థులు : "భూమి గుండ్రంగా ఉన్నది."

టీచరు : "గుండ్రముగా వుందనడానికి నిదర్శనం ఏమిటి ?"

విద్యార్థి : "ఎంత తిరిగినా పేడ తప్ప ఏం కనిపించదండీ."

టీచరు : "రైట్, పదిమార్కులు.... వినండి. ఈ ఖగోళ శాస్త్రజ్ఞులు ఏమంటారంటే.... కొన్ని యుగాల కిందట, మొదట. ఈ భూమి వేడిగా పొగలు కక్కుతూ ఉండేదిట. ఇప్పుడు చల్లారింది. అటు తరవాతే యీ జీవసృష్టి ప్రారంభమైది."

(ఇందాకనేకదా ఆవు పేడవేసింది. ఆ వేడిసంగతి గావును! అనుకున్నాను నేను.)

పక్కనే ఇంకోచోట ఒక సభ జరుగుతోంది. అక్కడ కాషాయ వస్త్రాలు వేసుకున్న పురుగూ, నల్లటి సూటువేసుకున్న తెల్లని పురుగూ సభలో ఎత్తుస్థలంమీద కూచున్నారు..... ఆ సూటు పురుగు ఉపన్యాసం ఇస్తోంది.

"నిన్న రాత్రి నాకు ఈశ్వరుడు కలలో కనపడ్డాడు. ఈ కొత్త మత విధానాన్ని నాకు ప్రసాదించాడు. లోకమంతా పాపంతో నిండింది. అవినీతి హెచ్చింది. స్త్రీ పురుషులు నియమాలు లేకుండా వర్తిస్తున్నారు. మన స్వామీజీగారు చెప్పినట్లు బ్రహ్మచర్యాన్నే మరిచినారు. ఈ కొత్తమతం మీకు నా ద్వారా ఈశ్వరుడు ప్రసాదించాడు. ఇంక కొత్తయుగం ప్రారంభంకాబోతోంది. ఇంక మానవుడికి మరణభయం లేదు. నేను అభయహస్తమిస్తున్నాను" అని చెయ్యి చాపాడు.

ఇంతలో పొరుగమ్మ మణి వొచ్చి పేడ అవసరమయిందనుకుంది గావును. ఓ ముద్ద చేతిలోకి తీసుకుంది. ఆ ముద్దలో యీ ఉపన్యాసకుడు కూడా లేచి వెళ్ళిపోయినాడు. సభాసదులంతా 'బొందితోనే కైలాసానికి వెళ్ళాడని' అతనికి గొప్ప సమాధి కట్టించడానికి తీర్మానాలు చేసుకుంటున్నారు.

ఆ పక్కనే ఓ చక్కని గూడులో ఓ ఆడపురుగు తన పిల్లతో అంటోంది-"ఒసే ఎన్నడన్నా మన వంశంలో వుండే ఇట్లాంటి నీచపు గుణం ? ఆ పాడు మురికి నల్లపురుగుని

నీ తోకతో దాని ముదనష్టపు తోకకి కలవనిచ్చావే ! మీ అమ్మమ్మ ఎంత పతివ్రత ! మీ తాతమ్మ ఎంత పుణ్యవతి కింద ప్రసిద్ధికెక్కింది? నీకిదేం పోయేకాలమే ! నీ మూతిమీది ఆ రంగేమిటి !" అంటోంది.

ఇంకోవేపు చూశాను. రెండు పురుగులు పోట్లాడుకుంటున్నాయి.

"నా గీతాలు ఆచంద్రార్కంగా నిలుస్తాయి. ఈ పేడకుప్పలో నా అంత అందంగా రాసేవాణ్ణి చూపగలనా ? నీ మొహం నువ్వూ ఓ కవివే ! అసలు పద్యం రాయడమంటే నీకేమన్నా తెలుసా !"

రెండో పురుగు : "నా కవిత్వం. ఈనాటి ప్రజలకు కాదు. నాలుగు యుగాలు పోయాక పుట్టబోయే పురుగులకి. అవి నీకన్న కొంచెం తెలివైన మెదడుతో పుడతాయి" అంటోంది.

ఇంతలో ఓ బొండుపురుగు సమీపించి "నాకో పుస్తకం అంకితం ఇవ్వరా మీలో వొకరు ? నా పేరు ఆకల్పాంతం నిలుస్తుంది ! నేను పుస్తకాన్ని చాలా అందంగా పేజీకి ఒక్క పంక్తి చొప్పున అచ్చువేయిస్తాను" అంటోంది.

వీళ్ళ వెనకనే ఒక గొప్ప పురుగుల సభ జరుగుతోంది. ఓ పురుగు తన కావ్యాన్ని యింకో బండ పురుగుకి, తన నోటి జిగటతో ధారపోస్తోంది. పాదాలమీద పువ్వులవంటి పేడవుండల్ని చల్లి నమస్కరించింది. అందరూ చప్పట్లు కొడుతూవుండగా ఒక బక్కనక్క ఆడపురుగు లేచి, తన కవిత్వం చదవడం ప్రారంభించింది. యీ దేశ ఔన్నత్యం మీదా, ఈశ్వరుడు శాశ్వతంగా పురుగుల హృదయాల్లో వెలుగుతూ, తన కలలో కనపడి తనకి యీ కవిత్వాన్ని ప్రత్యేకంగా ఎట్లా ప్రసాదించాడో, పూర్వపు స్త్రీలు ఎంత పతివ్రతలో ఈనాటి స్త్రీలు యెంత హీనులో, ఇంకోపక్కన మొహానికి పాచిపోయిన పేడని పూసుకున్న నవనాగరికపు పురుగు, మొగ పురుగుల వంక కన్నుకొట్టి ఇకిలిస్తోంది.

ఇంక కొంతదూరంలో ఒక మొండిగోడల ఇల్లు కనపడ్డది. దాంట్లో కొన్ని పురుగులు తలకిందుగా వేళ్ళాడుతున్నాయి. కొన్ని తలల్లోంచి కడ్డీలు గుచ్చుకున్నాయి. కొన్ని మేకులమీద పడుకునివున్నాయి. ఆ గోడకి ఒక చెక్క వుంది. దానిమీద "యోగాశ్రమం. దీంట్లోకి స్త్రీలు ప్రవేశించకూడదు" అని వుంది.

వాలికిముందు ఇక పెద్దసభ వుంది. దాంట్లో ఆ ఆశ్రమపు అధ్యక్షపురుగు ఉపన్యాసం ఇస్తోంది.

"ఈ లోకం అసత్యం, మాయ, ఆత్మ శాశ్వతం. తుచ్ఛ సుఖాన్ని వొదలండి. ఇంద్రియాల్ని అరికట్టితేనేగాని ఆత్మజ్యోతి దర్శనం కాదు. అందరూ యోగ సాధన చెయ్యండి. యోగప్రభావం వల్ల గాలిలో పైకిలేచే శక్తి వొస్తుంది."

అంటోవుండగా ఆ వేపుకి వొచ్చిన ఓ కోడి ఆ యోగిపురుగుని ముక్కుతో పైకెత్తింది. పురుగుల కళ్ళదృష్టి అంతయెత్తుకి చూడలేదు గనక ఆ యోగి అట్లా పైకిలేచి వెళ్ళి పోయినాడనుకొని భక్తితో అన్ని పురుగులు సాష్టాంపడ్డాయి.

కొన్ని పురుగులు ఒకచోట చేరి, సభచేస్తున్నాయి. "మన పేడ వేరు, మన జాతి వేరు. మనం చాలా తెలివిగలవాళ్ళం, ప్రతిభావంతులం. ఈ పేడంతా ఒకటే, పురుగుజాతి అంతా ఒకటేనని అబద్ధాలు చెప్పి, మన ఐశ్వర్యాన్ని, మన భాషని, మన సంస్కృతినే అణగదొక్కేస్తున్నాయి. పక్కనున్న నల్ల పురుగులు, అవి పేడని వుండలుగా చేసుకునిగాని తినవు. అవి పురుగు జాతికి కాళ్ళు అవసరమంటాయి. మనం ఎట్లానన్నా సత్యాగ్రహం చేసి ఐనా సరే విడిపోవాలి" అంటూ వుండగా పైనించి ఆవు వుచ్చపోసింది. ఆ ధారతో ఆ దేశమంతా జలమయమయింది. వెంటనే మిగిలి బతికిన ఒక జడలపురుగు, "ఈ వరదలు మన తాతలుచేసిన పాపాలకి ఈశ్వరుడు కోపించి చేసిన ప్రతీకారం. ఇంకనన్నా యీ భేదత్వాన్ని మాని సమత్వానికి రండి" అంటున్నాడు.

కాని ఒక తెల్లని గడ్డంపురుగు, "ఇదేమి మూర్ఖం, మన తాతలు చేసిన దానికి మనమీద కోపం కలుగుతుందా ఈశ్వరుడికి ? ఇంతకాలం పట్టిందా అతను తెలుసుకుని కోపించ డానికి అదేదో నీటిధార పడ్డది. శాస్త్రజ్ఞులు దానికి కారణం కనుక్కోగలరు !" అన్నాడు. ఆ మాటలకి పురుగుజాతికి కోపమొచ్చి, ఆ గడ్డంపురుగుని మోసుకుపోయి గట్టిపేడలో వూపిరాడకుండా పాతి చంపేశాయి.

ఒకమూల ఓ గుంపు పోగయింది. ఓ వంకర్ల ఆడ పురుగు ఎక్కడో ఓ దారాన్ని సంపాయించి చుట్టుకుంది. కొంచెం బాగా తెలుపుగా పాచిపట్టిన పేడని మొహానికి రాసుకుని, మూతికి కొంచెం రక్తపు చుక్కని అంటించుకుని, చేతులో ఓ చీకిన ఆకుముక్కని వేళ్ళాడేసుకుని, కులుకుతో తిరుగుతోంది. వెంటనే మొగపురుగులన్నీ, "దేవతా, ఏ లోకం నించి వొచ్చావు ? ఏ సౌందర్య సందేశాన్ని తెచ్చావు ? నిన్నే విధంగా మేము ఆరాధించ గలం !" అని సాష్టాంగపడ్డాయి. నాలుగైదు కవి పురుగులు ఆమె మీద పద్యాన్ని రాసుకుంటో వెంటపడ్డారు. ఇంతలో ఆమెని తక్కిన ఆడపురుగులు చూసి, "ఇది రాక్షసి, విపరీతం, దీన్ని నిలువునా చీల్చేస్తాము" అని మీదికి దూకాయి. వృద్ధపురుగులు "ఇట్లాంటి స్త్రీ పురుగుల విపరీత వేషాల వల్లనే ఆయువు తగ్గింది, పేడకీ రుచిపోతోంది, పేడ కంపాలు కలుగుతున్నాయి" అని అరుస్తున్నాయి. కాని యువకపురుగులన్నీ నవీనపురుగును రక్షించి ఆమెని తమ యిళ్ళకి ఆహ్వానించారు. ఆమెని రక్షిస్తామని శపధాలూ, ప్రమాణాలూ పట్టారు. ఒకరికన్న ఒకరు ఆమెకి ఎక్కువపేడనీ, చీకిన ఆకుల్నీ, దారాన్నీ వాగ్దానం చేసి ఆమెని వేలం వేసుకుంటారు. కాని ప్రతివారూ ఎట్లాగన్నా ఆ దారాన్ని తొలగించి, ఆ దారం వెనక ఏముందో చూడాలని చాలా తహ తహ పడ్డారు. పక్కనున్న చిన్న కుప్పలోంచి ఓ బొండుపురుగు చూసింది. ఆ నారీ పురుగుమణిని, తటాలున దూకి యువక పురుగుల్ని

తన్ని ఆమెని ఎత్తుకొనిపోతోంది. మొదట్లో ఆ దారపు పురుగు "హా, హా , రక్షించండి" అని అరిచింది. కాని త్వరలోనే బొండుపురుగుని కావిలించుకొని ముద్దులాడింది. ఆ సంగతి తెలీక ఆమెని ఎత్తుకుపోవడం దౌర్జన్యమనీ, తమ జాతికే అవమానమనీ, యీ పురుగులన్నీ దండెత్తడానికి యుద్ధసన్నాహాలు చేసుకుంటున్నాయి.

ఇంకొకచోట ఒక పెద్ద సభ జరుగుతోంది. అఖిల సారస్వత సమ్మేళనం. దాంటోకి చాలారకాల వింతపురుగులన్నీ వొచ్చాయి. ఒక మూల ఒక సంపాదకీయ పురుగ ఒక చచ్చిన చిన్న పురుగుమీద నుంచుని ఉపన్యాసం యిస్తోంది.

"ఈ పురుగు పేడ వాంగ్మయానికి చాలా సేవచేసింది. ఈ పురుగుకి మనం ఒక్క సన్మానమూ చెయ్యలేదు. ఇప్పుడు మనం విరాళంగా చందాలిచ్చి గొప్ప స్మారకచిహ్నం కట్టాలి. అందరూ నుంచోండి. ఈ పురుగు ఆత్మని ఊర్ధ్వలోకానికి పంపి శాంతి నివ్వాలని ప్రార్థిద్దాము" అంది.

కాని ఎవరూ నుంచో లేదు. పైగా గుసగుసలాడుతున్నారు సభాసదులు.

"చందాలన్నీ వీడే కొట్టెయ్యడానికి"

"అయినా ఆ కవిగాడికి ఆత్మశాంతి ఏమిటి ? వాడు రాసినవన్నీ అవినీతి బూతుకథలే,"

"వాణ్ణి పొగడడానికి, వాడిలాంటివాడు వీడోడు దొరికాడు."

అక్కడే ఓ ముసలిపురుగు కొంత పేడని పోగుచేసుకుని దానిమీదకూచుంది. దాని పాదాలముందు పిల్ల కవి పురుగులు తమ తమ రచనల్ని అర్పించి, వరసగా చదువుతున్నారు. ఆ పురుగు తన యిష్టప్రకారం "ఈ కావ్యం తుక్కు. ఈ కావ్యం పదేళ్ళు నిలుస్తుంది. ఈ కావ్యం వెయ్యేళ్ళు నిలుస్తుంది" అంటోంది ఆడకవుల కావ్యాలు మాత్రం చాలా మెచ్చుకుని, ఆచంద్రార్కంగా నిలుస్తాయని దీవించి, తన పీఠం మీద కూచోపెట్టుకుంటోంది అందమైన పురుగుల్ని.

ఇంతలో అక్కడికి పెద్దపెద్ద జండాలతో అరుపులతో ఓ పురుగు గుంపు ప్రవేశించింది.

"లాగెయ్యండి వాణ్ణి కిందికి లాగెయ్యండి. ఇదంతా పేడ గలవారి సారస్వతం. దీనివల్లనే సామాన్యులకి అన్యాయం జరుగుతోంది. ఈ పేడనంతా ఒకటే తూనికగల ఉండలుగాచేసి పురుగులన్నిటికి సమానంగా పంచవలసినదేగాని, కొన్ని బలిసిన పురుగులు మాత్రం ఇట్లా గుట్టల కింద చేసుకుని దానిమీద కూచోడానికి వీల్లే దు. లాగెయ్యండి వాణ్ని కిందికి లాగెయ్యండి. వీళ్ళు రాసే గ్రంథాలూ, కవిత్వాలూ, ఎవరికీ అర్థం కావు. దేవుడూ, భక్తీ, శృంగారం ఇట్లాటివే రాస్తారు వీళ్ళు. వీళ్ళనీ, వీళ్ళ కవిత్వాన్నీ ధ్వంసంచేస్తేనేగాని శాంతిలేదు లోకానికి. లాగెయ్యండి, వీళ్ళని" అని అరిచారు. అంతటితో ఆ అధ్యక్షుణ్ణి కిందికి లాగేసి పడేసి, ఆ సభని చిందరవందరచేసి పోయినారు వాళ్ళు.

వాళ్ళు పోగానే తన ప్రియురాళ్ళతో కూడా పైకిలేచి దులుపుకుని, మళ్ళీ పేడని కుప్పచేసుకుని కూచుంది ఆ అధ్యక్ష పురుగు.

"పరవాలేదు, పరవాలేదు మహాపురుషులకి ఇలాంటి పతనాలు చాలా సహజం" అంది. వెంటనే కళ్ళు మూసుకుని బిగ్గిరిగా ప్రార్థన నారంభించింది.

"పరమేశ్వరా, నమస్కృతులు, భక్షించుటకు ఈ పేడను సృష్టించుటేగాక, అపారమైన దయతో, దీనియందు గొప్ప రుచిని కూడా ప్రసాదించియున్నావు. నేను సంపాదించుటకు నా పురుగు భార్యనూ, అధిక సంసారించుటకు అనేకమంది సుందరులైన ప్రియురాళ్ళనూ, నా ఆజ్ఞను పాలించుటకు పుత్ర పుత్రికలనూ ప్రసాదించినావు. కోళ్ళనించీ, కాకులనించీ, పెద్ద లద్దె పురుగుల నుండీ మమ్ము సర్వదా రక్షింపుము."

అనగానే పురుగులన్నీ ప్రార్థనాగీతా న్నందుకున్నాయి -

"పురుగూ పావనుడవూ నీవు. పురుగూ పాపులు మేము.

పేడా మాకు పెట్టామంటే, పెట్టక తన్నీవు !"

ఇంతలో పెద్ద పెద్ద జండాలు పట్టుకుని ఓ గుంపు ప్రవేశించింది. దాంటో బక్కపురుగు, ప్రార్థన చేస్తున్న సభాధ్యక్షుణ్ణి పక్కకి నెట్టి, గంభీరోపన్యాసం ప్రారంభించింది.

"సోదరీ, సోదరులారా, స్వదేశ మిత్రులారా, పురుగు మహారాజ్యధుర్యులారా, నేనెవరో మీకు తెలపనక్కర్లేదు. ఈ ఎన్నికలలో మీ వోట్లన్నీ నాకే యివ్వాలి మీరు. నా పార్టీవిజయ మందితే, నేను ప్రధానమంత్రినై, యీ రాజ్యంలో దరిద్రమూ, ద్వేషమూ, బాధా ఏమీ లేకుండా, అందరికీ సమానమైన హక్కుల్నిచ్చి, నేను రామరాజ్యన్ని స్థాపించపోతున్నాను. మనదేశము మహా పురాతనము ? తక్కిన దేశాలన్నీ మొన్న పుట్టాయి నిన్న నశించాయి. కాని యీ పురుగు దేశముందే యిది దేవతలు స్వయంగా నిర్మించుకున్న భూమి. దీనికి పతనం లేదు. ఇది అనంతకోటి యుగాల వరకు ప్రపంచానికి జ్యోతియైవెలగాలంటే. నాకు మీ వోట్లు ఇవ్వండి....." అని ముగించగానే పురుగులన్నీ "మోయించు జయభేరి, వాయించు నగారా" అని ఒకదానిమీద ఒకటి డబడబ బాదడం ప్రారంభించాయి.

ఇంతలో జయలక్ష్మి స్నానంనీళ్ళు పేడకుప్ప చుట్టూ పెద్దమడుగు కడుతున్నాయి. పేడ నాని పెళ్ళ పెళ్ళలుగా ఆ నీళ్ళలో కూలిపోతోంది పురుగులు ఆ నీళ్ళలోపడి కొట్టుకుపోతున్నాయి. బతికివున్న పురుగులు పళ్ళూ, కుంకం, కొబ్బరికాయలూ పళ్ళాలు పట్టుకువెళ్ళి, ఆ నీటి ప్రవాహానికి పూజలు చేశాయి.

ఆ ప్రవాహాన్ని, స్వర్గనది అనీ, ఆ నురుగును పవిత్ర పాదోదక ఫేనమనీ, ఏదో జటా జూటంలోంచి కారుతోందని వర్ణించి, దాంటో స్నానాలు చేసి, పాపాలు పోయినాయని చెప్పుకుంటున్నాయి.

ఒక పురుగు - "ఛా ఇది వుత్త బురద నీళ్ళు." అంటే తక్కిన పురుగులు "ఓరి మత భ్రష్టుడా, పాషండుడా, వుత్త నీళ్ళకి ఈ సుగంధ మెక్కడినుండి వొస్తుంది ?" అని

ముక్కులతో పొడిచి దాన్ని నీళ్ళలోకి తోసేశాయి.

"ఇదేమిటి ఈ తుచ్ఛపు అవిశ్వాస పురుగుని ఈ పవిత్రవాహినిలోకి తోశారు ? దానికి సద్యోమోక్షం వొచ్చేస్తుందే !" అని ఏడ్చాయి కొన్ని పురుగులు.

ఆ నీటిప్రవాహంలో స్నానంచేసి కొన్ని ఆడపురుగులు ఒకచోట చేరి ఒక సభ చేశాయి. ఒక పురుగు ఆ నీళ్ళలో తిలోదకాలు వొదిలి.

"మన కష్టాలకై పరితపించి, ఈ మొగ పురుగుల నిరంకుశత్వాన్నించి మనని తప్పించడానికై సారస్వతం ద్వారా పాటుపడ్డ ఆ మహా పురుగుకి మనం యీవాళ యీ అర్పణ చేస్తున్నాము" అంది.

"ఏదీ. ఆ పురుగు ?" అన్నాయి కొన్ని కంఠాలు.

"లేదు. తన ఆత్మని శాశ్వతం చేసుకోడం కోసం దక్షిణంగా పర్వతాలలోకి పోయింది" అన్నారు కొందరు.

అన్ని పురుగులూ లేచి నుంచునీ పాటలు పాడి ఆ పురుగు ఆత్మశాంతికై ప్రార్థించాయి. ఆ నీటి ఒడ్డున కొన్ని పురుగులు తగాదాలో పడ్డాయి.

"పేడ తినాలిగాని, దానిలోని చిన్న తెల్లని పురుగుల్ని తినడం మహాపాతకం" అంటాయి కొన్ని.

రెక్కలున్న పురుగుల్ని తినకూడదని కొన్నీ, నీళ్ళలో దొరికే పురుగుల్ని తినకూడదని కొన్నీ వాదించాయి.

"అసలు పచ్చి పేడనేగాని మగ్గిన పేడని తినకూడ"దని కొన్ని పురుగులు బోధిస్తున్నాయి. అదే ఆరోగ్యకరమనీ, పచ్చిపేడని వుండలు వుండలుగా చేసుకుని, నిర్ణయంగా రోజుకి ఓ వుండని మింగితే పురుగులు రెండు వందల ఏళ్ళు బతుకుతాయనీ, రోగాలూ, వుప్పెనలూ, వ్యభిచారాలూ విప్లవాలూ, మగ్గిన పేడ తినడం వల్ల నే కలుగుతున్నాయనీ రూఢి చేశాయి.

పేడరసాన్ని పులిపించి తాగడంవల్ల చాలా ఘోరాలు తటస్తిస్తున్నాయనీ పులవపెట్టకండా తాగితే వొంటికి మంచిదనీ, పేడ మద్యాన్ని నిషేధించమని ప్రభుత్వానికి అర్జీలు పెడుతున్నాయి కొన్ని పురుగులు.

కొన్ని పురుగులు పేడని అణువులకింద విడగొట్టి పేడ అణువు స్వరూపాన్ని తెలుసుకుంటే సృష్టిరహస్యం అర్థమౌతుంది అంటున్నాయి.

ఒక కాషాయపు పురుగు,

"నేనే పరమేశ్వరుణ్ణి. ఇదంతా లీల. నేనే కర్తను, కర్మను, క్రియను. నేనే గీతం. నేనే భావం" అంటోంది.

ఇంతలో జయలక్ష్మి దాసీది వొచ్చి పొయ్యి అలకడానికి ఆ పురుగుల్ని చూడకుండా, ఆ పురుగులున్న పేడనంతా ముద్దచేసి తీసుకుపోయింది.

ఆ ముద్దకిందనించి రెండు తెల్లటి పురుగులు బైటపడ్డాయి. ఒకదానికి జయలక్ష్మి మొహం, ఇంకోదానికి నా మొహం. రెండూఒకదానితో ఒకటి పెనవేసుకుంటున్నాయి. అది పోట్లాటో మోహమో తేల్చుకోలేకపోయాను. వాటి దగ్గిరగా ఓ నల్లటి కాకి వాలింది. దాన్నిచూసి ఆడపురుగు భయపడి, మొగపురుగు వెనక దాగింది. ఆ కాకి తన మీదికి వొస్తుందేమోనని ఆడపురుగుని ముందుకునెట్టి మొగవాడు ఆకులకింద దూరాడు. ఇంక దిక్కులేక ఆడపురుగు పెరగడం ప్రారంభించి నిమిషంలో జయలక్ష్మిగా మారింది. వెంటనే పేడకుప్ప నా కళ్ళముందు మాయమై ప్రపంచం మామూలుగా ప్రత్యక్షమయింది. జయలక్ష్మి తలలో కదంబం, గులాబి పువ్వులు పెట్టుకుని, స్నానం పరిమళాలతో, ఆకుపచ్చ వెంకటగిరి చీర కట్టుకుని, నవ్వుతోంది నన్ను చూసి.

"ఆరాధన అయిపోయిందా ?"

నేను చూసిన దృశ్యాలు నా మనసునించి తప్పిపోలేదు.

"ఏం బతుకు మనది ? ఏమిటి అర్థం ?"

"ఈ తగాదాలేనా ? అదే నేనూ అడగాలనుకున్నాను."

"తగాదాలు కాదు, అసలు ఈ ప్రేమ."

"బతుక్కీ ప్రేమకీ కూడా అర్థం కనపట్టం లేదా మీకు ?"

"ఏమిటో యిప్పుడు పుట్టి రేపు నశించే పురుగులం."

"కాని ఈ రాత్రికి దేవతలం. ప్రేమలో అమృతులం, లోపలికిరా."

"నేను రాను. బొంబాయి వెడుతున్నాను రాత్రికి."

"నేనే తీసుకుని వెడతానుగా నిన్ను !"

"ఎక్కడికి ?"

"బొంబాయిని మరిపించే దివ్యనగరానికి."

"నేను బొంబాయే వెడతాను."

"వెళ్ళి ?"

"వెళ్ళి నిన్ను మరిచిపోతాను."

"నన్నూ - నిన్నూ మరిపింపచేస్తాను."

"పోట్లాడతావు నాతో."

"నా పోట్లాట మాత్రం ఏం శాశ్వతం ? ఎందుకంత బాధగా తీసుకోవాలి నువ్వు ? ఏదో రేపు పొద్దున్నకి నశించేవాడివి ? పద."

రెండు పురుగులూ గూట్లోకి వెళ్ళాయి.

◆ ◆ ◆

*ప్రచురణ : (ఆత్మార్పణ కథల సంపుటి) ప్రజాప్రచురణలు*